# మర్రిచెట్టు నీడ

ప్రొ॥ ముదిగొండ శివప్రసాద్

''కాయ్ రాజా కాయ్. పావలాకు రూపాయి-రూపాయికి నాలుగు-నాలుగుకు పదహారు.''

జనం గుంపు కూడారు.

మధ్యలో లాటరీ రంగడు పెట్రమాక్సు లైటు పట్టుకొని కూర్చున్నాడు. ముందు ఓ పెద్ద పట్టుగుడ్డ. దానిమీద పులీ, నెమలీ, కోడిపుంజూ వంటి బొమ్మలు- పక్కనే గిర్రున తిరుగుతున్న ఓ చక్రం! జనం యధాశక్తి కాచుకొని తమ అదృష్టం చూసుకుంటున్నారు. ఆట జోరున సాగిపోతున్నది.



అప్పుడు ప్రవేశించాడు యతిరాజులు.

యతిరాజులును చూడగానే జనం కొంచెం పక్కకు తప్పుకొని చోటిచ్చారు.

''హేయ్-ఇంకా ఎవరుబాబూ-లక్కీ అదృష్టం-లక్కీ-ఆ-పావ'' తల పైకెత్తిచూచాడు రంగడు.

ఎదురుగా యతిరాజులు! బీడీ పొగతో మేఘాలు సృష్టిస్తున్నాడు.

రంగడు తృప్తిగా ఓ నవ్వు నవ్వి, మళ్లీ ఆటలో మునిగిపోయాడు. హుషారుగా ఆ నవ్వే రాజులకు పాదాభివందనం.

యతిరాజులు చుట్టూవున్న జనాన్ని చూచాడు.

దాదాపొక యాభై గ్రామాలనుంచీ వచ్చిన జనం వున్నారక్కడ. మర్రికుంట చిన్న గ్రామమైనా ఈ

తిరణాల పదిరోజులూ దేదీప్యమానంగా వెలిగి పోతుంది. ఆ మిఠాయి దుకాణాలూ, చెరుకు రసాలూ, మామిడిపండ్ల గుట్టలూ, బుట్ట బొమ్మల ఊరేగింపూ, రంగుల రాట్నాలూ, సర్కారువారు ఉచితంగా ఏర్పాటు చేసే 'బైస్కోపు'లూ ప్రజలకిక ఒకటే పరవశం- పదిరోజులూ పదిక్షణాల్లాగా గడిపేస్తారు.

యతిరాజులు గుడివైపు చూచాడు.

స్వామివారికి లోపల చుండలూ పులిహోరా ఆరగింపు జరుగుతున్నది. తర్వాతకాని భక్త గణానికి దాన్ని పంచిపెట్టరు.

భక్తులంతా భజనలో నిమగ్నమైవున్నారు.

ఒకటే కోలాహలం.



వైశాఖ శుద్ధపూర్ణిమనాడు రథోత్సవం.

రేపే పూర్ణిమ.

రేపే రథోత్సవం.

రథాన్ని అప్పుడే దాని శాలనుంచీ కొంత యివతలకి లాగారు. టైరుబండ్లమీద మోకులు మోస్తున్నారొకవైపు.

గరుడ వాహనానికీ, పొన్నమానుకూ, పల్లకీ సేవకూ, అన్నింటికీ ఉభయాలు కుదిరాయి పూర్వం. ఒక్క రథోత్సవానికి మాత్రమే కుదర లేదు. అందుకని ఊరి వాళ్లంతా అప్పుడు ధర్మయ్యగారి దగ్గరికే వెళ్లారు. అప్పటికే ధర్మయ్య గారు గరుడ వాహనానికి ఉభయ ఇచ్చారు. అర్చకులూ, ఇతర పెద్దలూ అంతా ధర్మయ్య గారిని వేడుకున్నారు ''అయ్యా- మీరు దాన స్వరూపులు- సార్థక నామధేయులు- రథోత్సవం మీ చేతులమీదుగానే జరిపించాలి'' అని.

ధర్మయ్యగారు నిండుగా ఒక నవ్వు నవ్వాడు.

అప్పుడు యతిరాజులు ధర్మయ్యగారి కాళ్లు పడుతూ వున్నాడు నూనెరాసి.

''అయ్యా- పెద్దలంతా దయచేసి కూర్చోండి ముందు. ఏయ్ ఎవర్రా అక్కడ'' సంజ్ఞను అర్థం చేసుకొన్న ఇద్దరు పాలేర్లు అతిథులకు శీతల పానీయాలు ఇవ్వడం కోసం పరుగు పరుగున ఇంట్లోకి పోయారు.

''అమ్మగోరూ- పెద్ద మనుషులొచ్చినారండీ- ఆచార్లుగారూ వాళ్లూనూ...వాళ్లకు డ్రింకులు కావాలంట- కలపమా.''

''ఊ'' లెమన్ స్క్వాష్ బాటిల్స్ రెండు అందించింది శేషమ్మగారు.

''కమలా- వాళ్లకు పంచదార అందియ్యి.''

''అట్లాగేనమ్మా'' చేతిలో కథల పత్రిక అవతల పెట్టి కమల అలమరా నుంచీ పంచదార తీసి

పాలేళ్లకు అందించింది. ''ఎవరెవరు వచ్చా(రా-బాలిగా''

''చాలామంది వచ్చారమ్మగోరూ... ఆ వెంకటరత్తం గోరుకూడా వచ్చినారండీ'' కావాలనే అన్నాడు బాలిగాడు.

వెంకటరత్నం గారి పేరు వినేసరికి కమల హృదయం స్తంభించిపోయినట్లుంది.

ఎందుకు వచ్చారో ఆయన.

ఏమవుతుందో?

కుతూహలం ఆపుకోలేక మెల్లగా కిటికీ దగ్గర నిలబడి వింటున్నది.

''ఆ గరుడ వాహనం మనదే గదటండీ ఆచార్లు గారూ...ఆ రథోత్సవం మరే భక్తులైనా...''

''అమ్మమ్మ అలా అనకండి. రథోత్సవం అంటే ఖర్చు చాలా జాస్తి! లక్షప్రజ వస్తారు. ఇందరికీ సదుపాయాలూ, ప్రసాదాలూ సమర్పించడం ఎవ్వరివల్లా కాదు. పోనీలెమ్మని ఎలాగో ఇప్పటివరకూ స్వాములవారి అయివేజునుండే ఇస్తూవచ్చాము పైకం. కానీ ఈ దేవాలయం మరమ్మత్తులలో నిధులు బాగా తరిగిపోయాయి. తమబోటి ధర్మదాతలు చూచుకోవలసిందే ఆ ఉత్సవం ఇంక.''

''అంతే అంతే'' అన్నారు అతిథులు. ధర్మయ్యగారు నవ్వారు.

విచిత్రంగా నవ్వి అతిథులనందరినీ పరికించి విడివిడిగా ఒక్కొక్క ముఖం చూడటం మొదలు పెట్టారు. వెంకటరత్నం ముఖం చూచారు ధర్మయ్యగారు.

వెంకటరత్నం ఎందుకో తల వంచుకున్నాడు చటుక్కున.

''ఇదుగో మన వెంకటరత్నం గారున్నారు కదటండీ ఆచార్లుగారూ'' ధర్మయ్యగారు కావాలనే అన్నారు.

వెంకటరత్నం తల ఎత్తలేదు.

ఆచార్లు నీళ్లు నమిలాడు.

ధర్మయ్యగారొకసారి మీసాలు దువ్వుకొని యతిరాజులవైపు చూచారు. యతిరాజులు కాళ్లు పట్టడం ముగించి రెండు అరచేతులు రాచుకుంటున్నాడు.

''సరే-అట్లాగే-రథోత్సవం నేనే చేయిస్తాను'' ధర్మయ్యగారు బరువైన ఓ పనిని తన భుజ స్కంధాల కెత్తుకున్నందుకు సూచనగా మాటలు చాలా బరువుగా పలికాడు.

అతిథి జనం ఆనందంతో నిండిపోయింది.

''బాబూ ఇదిగో- తీసుకోండి'' ఒక్కొక్కరికి డ్రింకులిచ్చారు పాలేర్లు.

వెంకటరత్నం మాత్రం తీసుకోలేదు.

''తీసుకో వెంకటరత్నం'' ధర్మయ్యగారు ఆజ్ఞ చేసినట్లు అన్నారు.

వెంకటరత్నం వద్దన్నట్లు అడ్డంగా తలం వూపాడు.


ధర్మయ్యగారు ఓసారి యతిరాజులు ముఖం చూచి ఒక్కనిమిషం ఆగి పాలేళ్లకేదో వేరేపని పురమాయించి పంపించేసాడు ఇంటినుంచి.

''అయ్యా మరి మేము సెలవు తీసుకుంటాము'' అంతా లేచారు.

''మంచిదండీ'' ధర్మయ్యగారు అందరికీ గౌరవంగా వీడ్కోలు చెప్పారు.

కిటికీవద్ద కమల 'అమ్మయ్య' అని గుండెపై బరువు దిగినట్లు నిట్టూర్చింది.

ఆచార్యులవారు మెట్లు దిగుతూ అన్నాడు ''ధర్మయ్యగారు మన మర్రిగుంట గ్రామానికి మూలస్తంభం లాటివారు. దానాలకైనా, ధర్మాలకైనా వారి చేయే చేయి. వారి ఔదార్యమే




ఔదార్యము.''

జనమంతా ఔనౌనని ఏకగ్రీవంగా అంగీకరిస్తూ బయటకు నడిచారు.

''వెంకటరత్నం'' ధర్మయ్యగారు కేక వేశారు. వెంకటరత్నం నిజానికి బయటకు నడవనూ లేదు. అట్లని కూర్చోనూలేదు. కాని ఈ కేకతో నిలబడిపోయాడు.

''ఇట్లారా?'' ధర్మయ్యగారి ఆజ్ఞ.

వెంకటరత్నం తల వంచుకొనే ధర్మయ్యగారి దగ్గరకు వచ్చి కూర్చున్నాడు.

కమల గుండెలు దీనితో ఝల్లుమన్నాయి. కాళ్లు తడబడ్డాయి.

భోరున ఏడుస్తూ భయంతో పరుగెత్తుకొని పోయి శేషమ్మను వాటేసుకొని అరిచింది ''అమ్మా''

''యతిరాజులూ నీవు విన్నదీ కన్నదీ వెంకట రత్నానికి చెప్పు'' ధర్మయ్యగారు గంభీరంగా అన్నాడు.

''అక్కర్లేదు-నేనే చెపుదామనుకుంటున్నాను-అసలు నేనిందాక వచ్చింది అందుకనే-కానీ ఎలా చెప్పాలో తెలియక మళ్లీ వెనుకడుగు వేశాను.''

ధర్మయ్యగారేమీ మాట్లాడలేదు.

వెంకటరత్నం అన్నాడు. ''ధర్మయ్యా సాటివాణ్ని-తరతరాల బాంధవ్యం- ఆమాత్రం అర్థం చేసుకోగలవు నన్ను- నేనెలా సుదర్శనం తండ్రినో నీవూ అలాగే బిడ్డను కన్నవాడివి- కష్టసుఖాలు తెలిసినవాడివి- పిల్లల తప్పొప్పులు మనం కాకపోతే మరెవరు భరిస్తారు.''

''ఊ'' ధర్మయ్యగారు నిట్టూర్చారు- ఇవ్వాల్టితో వెంకటరత్నం పని అయిపోయిందనిపించింది యతిరాజులుకు- తను చెప్పకుండా వుంటే బాగుండేదేమోననిపించింది ఒక్కక్షణం. కాని రాజగోపాలస్వామి కోవెల పక్కన, రథశాల వద్ద సుదర్శనం చేస్తున్న పోకిరీ వేషాలు చూచి చెప్పకపోతే తప్పనిపించింది.

అప్పటికే అది నలుగురి నోళ్ల పడింది కూడాను. తన కళ్ల ఎదుటే తన యజమానికి అవమానం.

ఛత్ అదేదో తేలిపోవాలి.

ఆ సుదర్శనాన్ని అటో ఇటో సూడాలి.

అందుకే తనంత తానే స్వయంగా ధర్మయ్య గారితో చెప్పాడు యతిరాజులు.

''బాబుగారూ నలుగురూ నాలుగు మాటలను కుంటున్నారు ఊళ్లో. మీరు ఊ అనండి ఆ సుదర్శనంగాడి పని నేను చూస్తాను.''

ధర్మయ్యగారు ఔననలేదు. కాదనలేదు. యతి రాజులు కళ్లల్లోకి ఒక్కసారి తీక్షణంగా చూచారు.

''ఆమాత్రం నన్నర్థం చేసుకోలేవా రాజులూ ఇన్నాళ్లుండి'' అన్నట్టనిపించింది ఆ చూపు.

మంత్రానికి కట్టుబడ్డ తాచుపాములా వుండి పోయాడు యతిరాజులు...దాని ఫలితమే ఇవ్వాళ వెంకటరత్నం గారితో సంభాషణ..

వెంకటరత్నం అన్నాడు. ''ధర్మయ్యా- నేను మగపిల్లవాణ్ణి కన్నవాడిని. మనలో ఇది పద్ధతికాదు. అయినా నేను పద్ధతి తప్పి అడగక తప్పలేదు. మీ కమలను మావాడికి చేసు కుంటాను. దీనివల్ల మనకు బాంధవ్యమూ దక్కుతుంది. అప్రదిష్టా తప్పుతుంది.''

ఇంట్లో తలుపు దగ్గర శేషమ్మ కమల నిలబడి చాటుగా వింటున్నారు సంభాషణ. కమల నిలువెల్లా వణికిపోతున్నది. తండ్రి నోటి మాటలు వినాలని ఆమె తల్లడిల్లిపోతున్నది.

ధర్మయ్యగారు సరేననలేదు. కాదని నిందించనూలేదు.

''వెంకటరత్నం! లే భోజనానికి''

వెంకటరత్నం తిరస్కరించాడు.

ధర్మయ్య నిండుగా నవ్వాడు.

మొత్తానికి ఘటికుడివే వెంకటరత్నం. ఇందాక లెమన్ కూడా వద్దన్నప్పుడు- అప్పుడే అనుకున్నాను ఏదో, వ్యవహారం వుందిరా అని... ఏమి నమ్మకాలయ్యా నీవి'' యతిరాజులు నివ్వెరపోయాడు ధర్మయ్యగారి ఔదార్యం చూచి. తానైతేనా- నిలువునా చీరేసి వుండేవాడు తండ్రీ కొడుకులను.

''రాజులూ- ఆ కొబ్బరి బొండాలు తీసుకొని వెళ్లి వెంకటరత్నాన్ని ఇవ్వాళ్లింటిదాకా సాగ నంపిరా... ఏమేయ్, ఏం చేస్తున్నావు''

శేషమ్మ రంగస్థలం పైకి తొలిసారి వచ్చింది.

వెంకటరత్నంగారికి నమస్కారం చెప్పింది తలుపు దగ్గరినుండే. వెంకటరత్నం కూడా సెలవు తీసుకున్నాడు ఆ దంపతుల దగ్గర...

మరునాడు ఊరంతా తెలిసిపోయింది. కమలకు సుదర్శనానికి పెళ్లి నిశ్చయమై పోయిందని.

''ఓహో! ఔదార్యంరా ధర్మయ్యగారిది. నిజంగా ధర్మప్రభువు- ఇంకొకడైతేనా, ఆ సుద ర్శనం డొక్క చించి డోలు కట్టేవాడు- అరెరే! కూతుర్నిచ్చి పెళ్లి చేస్తున్నాడే ఓహోహో''

''అంతేనా, గరుడోత్సవమేకాక రథోత్సవం కూడా తానే భరిస్తున్నాడోయ్, ఎంత ఓర్పు. ఎంత దాతృత్వం.''

ఊరంతా ధర్మయ్యగారికి చేతులెత్తి నమస్కరించింది.

పెళ్లి వైభవోపేతంగా జరిగిపోయింది.

ఇక్కడే. ఈ మర్రిచెట్టు వరకూ పందిళ్లు.

ఈ రథశాల కవతల దేవుడి మైదానంలోనే వివాహ వేదిక...

బీడీ కాలి చెయ్యి చురుక్కుమన్నది యతిరాజుకు.

ఎదురుగా చెట్టువద్ద కలవరం...

జనం తొక్కిసలాడుకుంటున్నారు.

''యతిరాజులూ'' రంగడి కేక.

యతిరాజులు మోకులున్న టైరుబండ్ల దగ్గ ర్నుంచి ఒక్క అంగలో మర్రిచెట్టు దగ్గరకి

చేరాడు.

''డబ్బు తియ్యి'' రంగడి ఆర్తనాదం.

''ఎంత''

''ఓ వంద''

యతిరాజులు మారు మాట్లాడకుండా పది పదులిచ్చాడు. ''ఆ- ఎవరండీ ఇరవై వేసిందీ, ఆ తీసుకోవయ్యా సామీ ఎనభై- ఇదుగో నీకు పదికి నలభై...''

జనంలో హాహాకారాలు మిన్నుముట్టాయి. భయంతోకాదు ఆశ్చర్యంతో, ఆనందంతో. లాటరీ రంగడి నిజాయితీకి జనం తబ్బిబ్బై పోయారు. ఇక వెనకా ముందూ చూడకుండా కాస్తున్నారు పందాలు. రూపాయి రెండు- అయిదు- పదీ.

గుళ్లో భజన ముగిసింది. స్వామివారికి ఆరగింపూ జరిగింది. ముందుగా వడపప్పు, కొబ్బరి ముక్కలు పంచారు. భక్తులు పులిహోర, వడలకోసం ఎదురు చూస్తున్నారు. యతిరాజులు చేతులు దులుపుకొని గుడిద్వారం వద్ద నిలబడ్డాడు ద్వారపాలకుని విగ్రహంలాగా. రణగొణ ధ్వని. ఒకడనేది మరొకడికి వినిపిం చడం లేదు. దూరంగా రంగులరాట్నం గిరగిరా తిరుగుతోంది. చెరకు గడలు బండ్లకు బండ్లు అమ్ముడవుతున్నాయి. ఓ పెద్ద చెరకుగడను చేతి కర్రలాగా పట్టుకొని బుజంపైన ఓ పిల్లవాణ్ణెక్కిం చుకొని ఓ ముసలాయన మెల్లగా నడుస్తూ యతిరాజులు పక్కనే నిలబడి ఈ చోద్యమంతా చిత్తగిస్తున్నాడు పరవశంతో.

''బాబూ మనదేవూరు...ఈ ఊరేనా''

ఔనన్నట్లు తల వూపాడు యతిరాజులు.

''మాది నీరుకొండలే- అడ్డంగా కొండలోపడి వచ్చాము. మా వాళ్ళుందరమూ- రేపు రథోత్సవం చూచి పోతాము'' తనంత తానే పరిచయం చేసుకున్నాడు ముసలాయన. ఆరాత్రికి మర్రిచెట్టు కవతల చెరువు గట్టుమీద కొన్నివేలమంది జనంతో ఈయనా పడుకుం టాడు. మరునాడు అన్నదానం జరుగుతుంది. రథోత్సవం వైభవంగా జరుగుతుంది. అది చూచి పూర్ణమి వెన్నెలలో ఇంటిముఖం పడతాడు ఈ ముసలివాడు కూడా అందరిలాగే.

''ఆ మారాజు కడుపు చల్లగా నూరేళ్లు బతకాలి నాయనా... ఎంత అన్నదానం, ఏమి సంగతి, ధర్మయ్యగారు నిజంగా ధర్మరాజు తండ్రీ'' రథోత్సవం నిర్వాహకుడు ధర్మయ్య లోగడ చేయించిన అన్నదానం చూచినట్లున్నాడొకసారి ఈ ముసలాయన.

''ఊరి వాళ్లంతా ప్రతేడూ పిల్లకూనా అంతా రావలసిందే. ధర్మయ్యగారి ప్రసాదం తీసు కోవలసిందే.''

యతిరాజులు పరధ్యానంలో పడ్డాడు. అతని

## దొంగ

''ఇన్నేండ్లు నుంచి దొంగతనం చేసినా పట్టుబడనిది ఇప్పుడు ఎలా పట్టు బడ్డావు?'' జైల్లో అడిగాడు ఇంకో దొంగ.

''మా ఇంటి తలుపునకు 'దొంగ ఉన్నాడు జాగ్రత్త' అని నేమ్‌ప్లేట్ పెట్టాను మరి.'' చెప్పాడు దొంగ.

- పప్పు నాగరాజు
(తూఫాన్)

మనసు చికాకుగా వుంది.

రేపటి రథోత్సవానికి ఉభయం ధర్మయ్యగారిది కాదు వెంకటరత్నానిది.

లక్ష్మీదేవిలా కమల ధర్మయ్య గారింటినుండీ వెంకటరత్నం గారింటికి తరలింది.

పొగాకు వ్యాపారంలో ధర్మయ్యగారు దెబ్బ తిన్నాడు. పులి మీద పుట్ర అన్నట్లు గత మే నెలలో వచ్చిన తుఫానుతో ధర్మయ్యగారి తోటలు పాడైనాయి.

చూస్తే కడుపు తరుక్కుపోయే దృశ్యం.

దానితో మామూలుగా రథోత్సవం చేయండని ధర్మయ్యగారిని అడిగే సాహసం ధర్మకర్తలకు లోపించింది. సమయానికి ముందుకొచ్చాడు వెంకటరత్నం. ఆచార్యులువారు సూచనగా తనతో అన్నదానికి తన సంసిద్ధతను వ్యక్తపరి చాడు. ''ఎవరు దరిద్రులైనా, ఎవరు ధనవంతులైనా దేవుడి కల్యాణం మటుకు మనుషులకోసం ఆగకూడదు. ఆగబోదు కూడా. అది మన మర్రికుంటకే క్షేమంకాదు. కల్యాణమూ, రథోత్సవమూ నేను చేయిస్తాను'' అధ్యక్షులు పొంగిపోయారు.

ఊరంతా పరవశంతో పొంగిపోయింది.

యతిరాజులు కుంగిపోయాడు.

ఆదుర్దాగా వార్త చేరవేశాడు ధర్మయ్యగారికి.

ధర్మయ్యగారు వింతగా చూచాడు. చుట్టూ పెద్ద మనుషులు కూర్చుని వున్నారప్పుడు. ఏదో విషయం చర్చిస్తున్నారు వాళ్లు. ధర్మయ్య గారన్నారు ''నాకీ వార్త తెలీదు. ఆచార్లువారు నాతో అనలేదు. అయినా నేనయితేనేం వెంకట రత్నమయితేనేం యతిరాజులూ...''

ఔనన్నారు పెద్ద మనుషులు...

యతిరాజులు చిన్నబుచ్చుకొని ఇంట్లోకి వెళ్లిపోయాడు.

''ఏయ్ యతిరాజులూ'' రంగడి కేక.

యతిరాజులు చుట్టూ చూచాడు.

ఎదురుగా ముసలి తాత లేడు. రంగడు లాటరీ పట్టా చుట్టిపెట్టి ఘుప్పు ఘుప్పుమంటున్న పెట్రోమాక్సు లైటుకు గాలి కొట్టి ప్రాణంపోయ ప్రయత్నిస్తున్నాడు. భక్తులంతా పులిహోరా చుండలూ అందుకొని గుడినుండీ నిష్క్రమిం చారు. యతిరాజులు రంగణ్ణి చేరాడు.

''ఎంతరా మిగిలింది!''

అయిదు వ్రేళ్ళూ చూపాడు రంగడు. జేబులోంచి వందనోటు తీసి యతిరాజులికి ఇవ్వబోయాడు.

''ఏందిరా అది ఎదవా''

''తీసుకో అన్నా నీ నోటు''

''ఏడిచావులే. నోరుముయ్. ఉంచుకో జేబులో. ఇవ్వాల్టి లాటరీలో వాటా కూడా వద్దు. డబ్బంతా నీదే'' రంగడికిది వింతగా అనిపిం చింది. కొంచెం భయంతో వెర్రిముఖం వేశాడు. అయోమయంగా చూచి అన్నాడు ''ఎందుకని?''

యతిరాజులు రంగడి చెవిలో ఏదో రహస్యం చెప్పాడు. ''అమ్మో నేనే''

''ఆ- నువ్వే- పిరికి ఎదవా- మేమంతా లేమట్రా ఎనక'' బీడీ తీసి వెలిగించాడు యతిరాజులు- రంగడు మారు మాట్లాడకుండా ఊళ్లోకి వెళ్లిపోయాడు- అర్ధరాత్రి దాటింది. అంతా సద్దుమణగకపోయినా పొర్లబడ్డ జనం మాత్రం చెరువుగట్టు మీద పడి నిద్రలో దేహాలు మరచిపోయారు. యతిరాజులు మర్రిచెట్టు కిందే కూర్చున్నాడు నక్షత్రాలు లెక్క బెట్టుకుంటూ.

చీకట్లో ఏదో కదిలినట్లనిపించింది.

''ఎవడురా వాడూ''

''నేనే'' రంగడి గొంతు.

''ఏమయింది'' యతిరాజులు ప్రశ్న.

మౌనం!

''ఏరా''

''ఆ- చూడు''

ఊళ్లో దూరంగా వెంకటరత్నంగారి ఇంటివైపు మంటలు కన్పడుతున్నాయి.

''రాజులు...'' రంగడు మెల్లగా అన్నాడు.

''ఆ'' చొక్కా విప్పి తలకింద పెట్టుకొని చల్లగా గాలిని పీలుస్తూ అన్నాడు యతిరాజులు.

''ఇంట్లో అమ్మాయిగారు వాళ్లు లేరా...''

''లేరు. అంతా అయ్యగారింట్లో వున్నారి య్యాళ''

రంగడు నిట్టూర్చాడు. ''మరి రేపు రథోత్సవం.''

''నోరు ముయ్. మామూలుగానే జరుగు తుంది. ప్రతి యేడూ ఎవరు చేయిస్తున్నారు. అట్లాగే- వెర్రిమొహమా- వేరే సంగతులు మాట్లాడు.''

''ఆ ఆ'' రంగడు నసిగాడు.

''అట్లాగే- అట్లాగే, రాజులూ! వేరే సంగతులే మాట్లాడతా! ఈ మర్రిచెట్టు చల్లగా వుంది- మంచి గాలినిస్తున్నది. మన మర్రిగుంటకిదొక వరం.''

''ఔను! కాని మర్రిచెట్టు నీడలో వేరే మొక్క మాత్రం మొలవదు. అదొక శాపం'' అన్నాడు యతిరాజులు.

★

